క్లుప్తంగా

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవాలు



మునగపాకలో వినాయకున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండల కేంద్రంలో ఆదివారం వినాయక ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పురాతన దేవాలయం కావడంతో దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ మందపాటి రాము తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యానారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు తదితరులు వినాయకున్ని దర్శించుకున్నారు.

2న మునగపాక పరదేశమ్మ తల్లి పండగ

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 2న పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తెలిపారు. తెల్లవారు నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పండగ సందర్భంగా పలు నేల వేషాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామస్తుల సహకారంతో అమ్మవారి పండగ ఘనంగా జరిగేలా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కృష్ణ కోరుతున్నారు. కాగా అమ్మవారి పండగకు సంబంధించి రూ.లక్షా 83 వేలకు వేలం పాటను మాజీ వార్డు సభ్యులు కాండ్రేగుల గణేష్ దక్కించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



దిమిలిలో చలివేంద్రం ప్రారంభించిన మన ఊరు మన వంతు సేవ సభ్యులు

రాంబిల్లి : దిమిలిలో ఆదివారం మన ఊరు మన వంత సేవ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. ప్రతి ఆదివారం మజ్జిగ, ప్రతి రోజు చల్లని తాగునీరును ఈ చలివేంద్రం కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని మన ఊరు మన వంతు సేవ ప్రతినిధి బొడ్డపు మాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో బండి నానాజీ, బండి గణేష్, కన్నం బాలాజీ, బొడ్డపు శ్రీను పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ శత వార్షికోత్సవాలు



బాలభాస్కర్‌శర్మకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆలయ శత వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాకుళం శ్రీచక్ర శ్రీరాజరాజేశ్వరీదేవి ఆశ్రమ పీఠాధిపతి బాల భాస్కర్‌శర్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో శర్మకు స్వాగతం పలికారు. ఆలయ మండపంలో 500 మంది మహిళలు శ్రీచక్రాలకు కుంకుమ పూజలు జరిపారు. లలితా సహస్రనామ, ఖడ్గమాల సూత్ర పారాయణాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ సభ్యులు బాలభాస్కర్ శర్మకు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఫొటోను అందించి, గౌరవ సత్కారం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు



నాయకులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు



ఎస్.రాయవరం : డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న బొలిశెట్టి గోవిందు తదితరులు

ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది



బూడికి అడ్డురోడ్డులో స్వాగతం పలుకుతున్న దివ్యాంగుడు

పాయకరావుపేట : ప్రజల్ని ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ నాయకులకే ఉందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డినే మనందరం గెలిపించుకోవాలన్నారు.

పట్టణంలో నాయకులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పార్టీ నాయకులను, సర్పంచ్‌లను, ఎంపీటీసీలను బూడి ముత్యాల నాయుడుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటిలో ఎంత మందికి ఏఏ సంక్షేమ పథకాలు అమలు జరిగిందో కూడా కరపత్రాల ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. తనకు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీటు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినందుకు కష్టపడి పని చేస్తానన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంబాల జోగులును, ఎంపిగా తనను గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ తనకు మూడు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారని, తాను ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలకు రుణ పడి వుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా ఉప ముఖ్యమంత్రి, స్థానిక వ్యక్తి బూడి ముత్యాల నాయుడుని గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్సీ అంజూరి లక్ష్మి శివకుమారి, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్‌లు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.కె.ఆర్.ఎస్ లత, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, పంచాయతీ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

వలస అభ్యర్థులను తరిమికొడతారు...

ఎస్.రాయవరం : అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో ప్రజలు స్థానికేతరులను ఆదరించరని, సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తనకు పార్లమెంటు సీటు కేటాయించినందుకు విజ్ఞతతో పని చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థిగా ఎంపికైన బూడి ముత్యాలనాయుడు తొలిసారిగా ఎస్.రాయవరం మండలం విచ్చేశారు. ఈ మేరకు మండల నాయకులు అడ్డురోడ్డులో ఘన స్వాగతం పలికారు. సమావేశం ఏర్పాటు చేసి బూడి ముత్యాల నాయుడును దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ దళారులకు, దోపిడీదారులకు చంద్రబాబు సీట్లు కేటాయిస్తే, సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తనకు అందుబాటులో ఉండే వ్యక్తిని గుర్తించి జగన్ పార్లమెంటు సీటు ఇచ్చారన్నారు. చంద్రబాబు కూటమి డబ్బుతో ప్రజల ఓట్లు కొనాలని చూస్తున్నారని, పార్లమెంటు పరిధిలో స్థానికేతరులైన దోపిడీదారులకు సీట్లు కేటాయించారన్నారు. అనకాపల్లి బెల్లం పార్శిల్ చేసినట్టు సీఎం రమేష్‌ను ఆయన స్థావరాలకు పార్శిల్ చేస్తారని అభివర్ణించారు. పార్లమెంటు అభ్యర్థిగా తాను ఎంపీగా గెలిచిన మరుక్షణం నుంచి పార్లమెంటు కేంద్రం అనకాపల్లిలోనే అందుబాటులో ఉంటానని చెప్పారు. పిలిస్తే పలికే తనకు నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే కంబాల జోగులకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని చెప్పారు. పోలింగ్ జరిగే 43 రోజుల వరకు ప్రతి ఒక్క కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ విజయానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు అల్లాడ నాగరాజు, చేకూరి శ్రీరామచంద్రరాజు, దోసపాత్రుని హనుమంతరావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, గాడి అప్పలనరసింహా, మైలపల్లి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి సత్యం, కోశెట్టి వెంకటరమణ, మల్లే లోవరాజు, వైటోయిన సత్యనారాయణ, భూపతి అప్పారావు, పాలపర్తి పాపారావు, మార్కెట్ కమిటీ డైరక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, చోడిపల్లి కోదండ, వియ్యపు వరహాలు, చింతలపాటి మణిరాజు, వెలగా శ్రీను, గుర్రం నానాజీ, గొంతిన సత్యనారాయణ, వెదుళ్ల బంగారి, శిగటాపు జోగురాజు, కర్రి వరహాలు, మధువర్మ, దాట్ల రామరాజు, పోలిశెట్టి సతీష్, ఐ.వి.రత్న, కొవ్వూరి చిన సత్యనారాయణ, బోయిన లక్ష్మి, చల్లపల్లి సత్తిబాబు, కాసెపు అప్పన్న, శిగిరెడ్డి అప్పారావు, మైలపల్లి రాజారావు, చోడిపల్లి రమణ పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారంలో పాల్గొనండి



సమావేశంలో మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందరావు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పూర్తి సమయం ఎన్నికల ప్రచారానికి కేటాయించాలని మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు కోరారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద మండల పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. పార్టీ ఎప్పటికప్పుడు ప్రచార నమూనాలను పంపిస్తుందని, ఆ నివేదికలతో వెంటనే పూర్తిగా ప్రజల్లో కార్యకర్తలు ఉండాలని పిలుపునిచ్చారు. వలంటీర్లను అడ్డుకునేందుకు ప్రతిపక్ష కూటమి పార్టీలు కంకణం కట్టుకున్నారన్నారు. అయితే పార్టీ నాయకుల సహాయంతో ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించాలని పిలుపునిచ్చారు. సోమవారం సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వాకపాడు, వెంకటాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు ప్రచారానికి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు పంట



నారాయణపురం సమీపంలో సాగవుతున్న నువ్వు పంట

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో సాగవుతున్న నువ్వు పంట ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో నువ్వు మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నారాయణపురం, దిమిలి, మామిడివా, వెంకటాపురం, హరిపురం, రాజుకోడూరు తదితర గ్రామాల్లో నువ్వు పంట పూత దశకు చేరింది. నువ్వుల నూనెకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. దీంతో పంట బాగా పండి మంచి దిగుబడి వస్తే లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశాలకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు సంబంధిత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. అదే పాఠశాలలో ఈ నెల 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'వలంటీర్లపై చంద్రబాబు కుతంత్రాలు తగవు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు జగన్

మునగపాక : అవ్వా తాతలకు సకాలంలో మెరుగైన సేవలందిస్తూ వస్తున్న వలంటీర్లపై చంద్రబాబు అండ్‌కో కుట్రలు తగవని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షులు కాండ్రేగుల జగన్ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ తమకు కేటాయించిన కుటుంబాలకు మెరుగైన సేవలందిస్తూ దేశంలోనే గుర్తింపు తెచ్చుకున్న వలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచి చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్‌లు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబును ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేదన్నారు. ప్రతి నెలా 1వ తేదీన ఠంఛనుగ పింఛను ఇస్తూ అవ్వాతాతలకు అండగా నిలుస్తున్న వలంటీర్ల సేవలను వినియోగించరాదంటూ తన అనుయాయులతో కోర్టు కెళ్లడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దీంతో ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి కుతంత్రాలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు అందకుండా చంద్రబాబు అండ్ కో కుటిల రాజకీయాలకు పాల్పడడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమని అలాగే యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు అత్యధిక మెజార్టీతో గెలుస్తారని అన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు శరగడం గౌరీశ్వరరావు, గృహ సారథి ఆడారి హరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రామకృష్ణ, ఈశ్వరరావులు

నక్కపల్లి : చినదొడ్డిగల్లులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. విశాఖ డెయిరీకి చెందిన పాలకేంద్రం అధ్యక్షుడు వెలగాకొండబాబు, వెలగా నాని, ఎస్ఎంసీ చైర్మన్ కొప్పిశెట్టి గోవిందు, కోన సూరిబాబు, కర్రి కరణాలు, కర్రి నాగేశ్వరరావు, చందక జీవ, చందకరమణ, కొల్ల నాని, పిల్ల అప్పారావు, వెలగా నవీన్, కోనరాము, పేపకాయల అరుణ్, అనంతరపు లోవరాజు, గొన్నాబత్తుల లచ్చలో పాటు మరో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్న సీఎం కావాలన్నారు. చంద్రబాబు వస్తే పథకాలన్నీ రద్దవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రరావు, భార్గవ్, సురేష్ వర్మ, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, ఎంపీటీసీలు బచ్చలరాజు నాయకులు గోవిందు, బాబ్జి, శ్రీను పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా..ఈ జాగ్రత్తలు పాటించండి

అవగాహన కల్పిస్తున్న పట్టణ పోలీసులు



చోరీల నివారణపై లౌడ్‌స్పీకర్‌తో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పట్టణ పోలీసులు

యలమంచిలి రూరల్ : వేసవి సెలవుల దృష్ట్యా చోరీల నివారణకు పట్టణ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఊరెళ్లాల్సి వస్తే ఇంట్లో నగదు, నగలు, ఇతర విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవడం మంచిదని ఆదివారం పట్టణ ఏఎస్ఐ పి.చెల్లారావు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి, ఎన్టీఆర్, ఫైర్ ఆఫీసు, ఏఎస్ఆర్ కాలనీలు, రాంనగర్, ఎర్రవరం, రంగావారివీధి, బీసీటీ రోడ్డు కాలనీ, దిమిలి రోడ్డు, తులసీనగర్ తదితర వీధుల్లో చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను లౌడ్‌స్పీకర్‌తో ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించారు. ఆరుబయట నిద్రించేవారు మెడలో విలువైన నగలు ఉంచుకోకూడదని, ప్రయాణాల్లో కూడా వీలైనన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఊరెళ్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని, బీరువా, కప్‌బోర్డుల తాళాలు తమ వెంట తీసుకెళ్లడం మంచిదని సూచించారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మేలని సూచించారు. అపరిచితవ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే తక్షణమే డయల్ 100 కుగానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారమివ్వాలని ప్రజలను కోరారు. విలువైన నగలు, నగదు, వస్తువుల గురించి ఇతరులకు చెప్పకూడదని తెలిపారు. దొంగతనాల నివారణకు పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు ఏఎస్ఐ చెల్లారావు చెప్పారు. రాత్రి వేళల్లో విస్తృతంగా పెట్రోల్, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దొంగతనాల నివారణలో ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోపాటు తమ శాఖకు సహకరించాలని పోలీసులు పట్టణ ప్రజలను కోరారు.

లోక రక్షకుని పునరుత్థానం

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పర్వదినం



యలమంచిలిలో పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న ఓ కుటుంబం



అప్పన్నపాలెంలో...



ఏబీసీ చర్చిలో దైవ సందేశం అందజేస్తున్న ఫాదర్



కాకివాని వీధి ఏబీసీ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు



కోటవురట్లలో..

యలమంచిలి రూరల్: మానవుల పాప పరిహారార్థం శిలువపై రక్తాన్ని చిందించి..మూడో రోజైన ఆదివారం పాపులను రక్షించేందుకు పరమ పునీతుడైన క్రీస్తుపునరుత్థానం చెందిన ఈస్టర్ పర్వదినాన్ని విశ్వాసులు యలమంచిలి పట్టణం,గ్రామీణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువనే పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్ సమీపంలో, గ్రామాల్లో,సొంత వ్యవసాయ క్షేత్రాల్లో సమాధుల వద్దకు చేరుకుని పరలోకగతులైన తమ ఆత్మీయ బంధు,మిత్రుల సమాధులను శుభ్రపరిచి,పువ్వులు, రంగులతో అందంగా ముస్తాబు చేసి,కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ప్రార్థనామందిరాలకు చేరుకుని దైవారాధనలో గడిపారు.స్థానిక కాకివానివీధి పురాతన ఏబీసీ చర్చి, బైపాసు రోడ్డులో ఉన్న రోమన్ కేథలిక్ చర్చి సహా పలు ప్రార్థనా మందిరాల్లో బిషప్‌లు,ఫాదర్లు దైవ సందేశాన్నిచ్చారు. తన పునరుత్థానంతో తానే జీవమినని క్రీస్తు ప్రపంచానికి చాటారని క్రైస్తవ గురువులు ఈస్టర్ విశేషాలను తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల చర్చిల్లో బైబిల్‌లోని క్రీస్తు పునరుత్థాన ఘటనలను భక్తులతో చదివించి అర్థాన్ని వివరించారు.

ఎస్.రాయవరం : మండలంలో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. క్రీస్తు చెప్పిన మాట ప్రకారం శిలువ వేయబడిన తరువాత తిరిగి లేచిన రోజున ఈస్టర్ జరుపుకోవడం జరుగుతోందని తిమ్మాపురం, కొరుప్రోలు సంఘ కాపరులు బి.డి. కిరణ్‌కుమార్, బొడ్డా సాల్మన్‌రాజు తెలిపారు. ఆదివారం వేకువ జామున చనిపోయిన వ్యక్తులు సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొరుప్రోలు, తిమ్మాపురం, ఎస్.రాయవరం, పెదగుమ్ములూరు, దార్లపూడి తదితర గ్రామాల్లో చర్చిల వద్ద అన్నసంతర్పణలు నిర్వహించారు.

రాంబిల్లి : ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలను పాస్టర్లు వివరించారు. అప్పన్నపాలెం, వాడనర్సాపురం, పంచదార్ల తదితర గ్రామాల్లో ప్రార్థనలు జరిగాయి.

కోటవురట్ల: మండలంలో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తమ ఆత్మీయుల సమాధులను సందర్శించి పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, బేతస్తా ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కేకేవీపీ నారాయణరావు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వైద్యుడు కేకేవీపీ నారాయణరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి కల్యాణి నర్సింగ్ హోమ్ మేడపైన ఆదివారం ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే టెస్ట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కర్రి సన్యాసిరావు, యల్లపు శ్రీరాములు, కర్రి త్రినాథ్, సేనాపతి మునసబునాయుడు, ఆడారి శివాజీ, బొడ్డేడ కాశి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్ల అందజేత



క్రీడాకారులతో చైర్మన్ నారాయణరావు, డైరెక్టర్లు శ్రావణ్, శ్రీకాంత్

నర్సీపట్నం: నింజాస్ అకాడమీలో బాక్సింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అకాడమీ డైరెక్టర్లు రబ్బర్ మ్యాట్లు అందజేశారు. రూ. 50 వేలు విలువ చేసే 45 స్పోర్ట్స్ మ్యాట్లను అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్లు సుతాపల్లి శ్రావణ్, శ్రీకాంత్ స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ ప్రాక్టీసు చేస్తున్న సమయంలో క్రీడాకారులు గాయపడుతున్నారని అన్నారు. ఇది గుర్తించి క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్లు అందజేసామన్నారు. కోచ్ శేఖర్ చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.